# మినీకథ

# పుట్టిల్లు

అమ్మా!

నేను అమ్మమ్మగారి ఊరినుంచి హాస్టల్‌కి వచ్చిన తరువాత ఈ ఉత్తరం వ్రాయకుండా వుండలేకపోతున్నాను. నేను ఆ పల్లెటూరిలో ఎంతో ఎంజాయ్ చెయ్యవచ్చని, పట్నం వాతావరణానికి కొన్ని రోజులపాటయినా దూరంగా హాయి వుండాలనే ఉద్దేశ్యంతో వచ్చాను. అనుకున్నట్లుగానే బయట ప్రశాంతమైన ప్రకృతిసిద్ధమైన వాతావరణం, చక్కని సీనరీస్ చూసి చాల చాల ఎంజాయ్ చేశాను. కాని నాకు నచ్చనిదల్లా ఆ ఇంటిలోని వాతావరణమే. ఊరిబయట కలుషితంగా లేదుగాని, ఇంటిలో బ్రతుకుతున్న మీలో చాల కల్మషం వుంది. ఈ విషయం వ్రాయడానికి నాకు చాల విచారంగా వుంది.

అమ్మా! ప్రతీ స్త్రీకి పుట్టిల్లు అనేది ఆత్మీయత పంచి, అలసటను తీర్చే విశ్రాంతి గృహం కావచ్చు. కాని అస్తమాను స్త్రీలు పుట్టిల్లు పుట్టిల్లు అంటూ ఎందుకు దానివెంట బడి అక్కడివారికి విశ్రాంతి లేకుండా చేస్తారో అర్థంకాదు. మనం ఉన్నన్నాళ్ళు అత్తయ్యల చాకిరీ, అమ్మమ్మ హడావిడి. నీది, పిన్నిది అజమాయిషీ నాకు నచ్చలేదు. నీకు అది పుట్టిల్లే కావచ్చు. కాని, అది అత్తయ్యల స్వంతఇల్లు కదా! ఏడాదికి ఒక్కసారే కదా అంటూ నెలల తరబడి అక్కడ ఉండి ఏడాదికి సరిపడా అక్కడనుంచి రాబట్టుకోవడం ఒకవిధంగా వారినుంచి రక్తం పీల్చుకోవడం లాంటిదే!

పిన్ని, నీవు కలసి అమ్మమ్మనుగాని మామయ్యలనుగాని ఊపిరి తీసికోనివ్వలేదు. నిజమే! తాతయ్య వున్నప్పుడు మీకు చాల పెట్టాడు. మామయ్యలు కూడా అప్పుడు తాతయ్య పెట్టినంత పెట్టకపోయినా, వారికి వున్నదాంట్లో అంతో, ఇంతో పెట్టినా మీలో తృప్తి అనేది ఏకోశానా కనబడలేదు నాకు. "నాన్నవుంటే అందరికీ యిలాంటి బట్టలే పెట్టేవాడా!" అని నీవు, పిన్ని, పెద్దమ్మ చాటుకివెళ్ళి ముక్కులు చీదుతోంటే నిజంగా నాకు చాల చిరాకువేసింది. ఈ రోజుల్లో ఒక మనిషికి మరొక మనిషి వుంటేనే ఎంతో భారమనిపిస్తుంది. అటువంటిది ఒక ఫామిలీ మీద పుట్టిల్లు అన్న పేరుతో మరికొన్ని ఫామిలీలు వెళ్ళవలసితే అవతలి వారికి శారీరకంగాను, ఎకనామికల్‌గాను ఎంత శ్రమో ఆలోచించరెందుకు? వెళ్ళవచ్చు. ఉండవచ్చు కొంతైనా తప్పులేదు. కాని అత్తయ్యలకు మీరు మీ ఇంట్లో పని చేసుకున్న దాంట్లో అంతా కాకపోయినా సహాయం చేస్తే అత్తయ్యలు కూడా సంతోషించేవారు కదా? చిన్న చిన్న ఖర్చులు కూడా మామయ్యల మీద రుద్దకపోతే మీరు మంచి హోదాల్లోనే ఉన్నారుకదా. కొన్ని కొన్ని మీ ఖర్చులు మీరు చేసుకుంటే మామయ్యలకు ఎంత రిలీఫ్‌గా ఉండేదో ఆలోచించరెందుకు?

నాకు తెలిసినంతవరకు మీ అక్క-చెల్లెళ్లు అందరూ పుట్టిల్లు అంటూ అక్కడినుంచి చాలవరకు తెచ్చుకొని ఇంతో అంతో సంపాదించుకున్నారు. అత్తయ్యలు మాత్రం ఆడబడుచులకు ధారపోస్తూ వాళ్ళ పెళ్ళయిన దగ్గరనుంచి ఎక్కడవేసిన గొంగళి అక్కడే అన్న సామెతలో వున్నారు. ఇది చాలా అన్యాయం అమ్మా!



మనం అందరం పాశ్చాత్యుల వేషభాషలు ఎన్నో అనుకరిస్తున్నాము. వారు వాడే పరికరాలు వాడుతున్నాం. వాళ్ళు మాట్లాడే భాష మాట్లాడుతున్నాంగాని, వారిలోని మంచి గుణాలను స్వీకరించలేకపోతున్నాం. కట్నాలు మానడంలేదు. కులమతాలు వదలడంలేదు. మూఢాచారాలు విడవడంలేదు. ముఖ్యంగా పెళ్ళయిన స్త్రీలు వాళ్ళ బ్రతుకులు వాళ్ళు బ్రతుకుతూ పుట్టిల్లు పేరుతో దోపిడీతత్వం వదలడంలేదు. వాళ్ళను పీడించి పీడించి మరీ పెట్టించుకుంటున్నారు.

అమ్మా! మీ పిల్లలు పెద్దవాళ్ళవుతున్నారు. పెళ్ళిళ్ళ వయసుకి వచ్చారు. ఇప్పుడు మీరు ఆలోచించవలసింది మీ పిల్లల విషయం-వారిని మంచిదారిలో పెట్టడంగాని, మీ పుట్టింటి నుంచి ఏమితెచ్చుకోవాలని కాదు. నీవు ఎంతసేపు ఒక తల్లికి కూతురుగానే ఆలోచిస్తావుగాని, ఇద్దరు కూతుళ్ళకు, ఇద్దరు కొడుకులకు తల్లిగా ఆలోచించవు కదా. ఇకపై పుట్టింటిని దెప్పడం ధ్యాస వదిలేసి నీ పిల్లలపై ధ్యాస నిలిపితే అందరికీ బాగుంటుంది. ఒక వేళ నీవు ఆ పని చెయ్యలేని నాడు నా పెళ్ళయిన తరువాత నేను చేసి చూపిస్తాను. పురుళ్ళపేరిట పుట్టింటికి వచ్చి నీ శరీరం గుల్లచెయ్యను. ఫార్మాలిటీస్ పేరుతో అస్తమానూ వచ్చి నాన్నగారి పర్స్ ఖాళీ చెయ్యను. తెలిసిందా? అమ్మా ఈ ఉత్తరంలోని సంగతి నీ కొక్కదానికే కాదు చెప్పుతుంట. నీలాంటి వారు ఆంధ్రదేశంలో ఆడబడుచులు వేలాది మంది వున్నారు. అందులో ఎవరు మారినా సరే నా ఉద్దేశ్యం ఫలించినట్టే. నేను తప్పు ఏదయినా వ్రాసి వుంటే క్షమించమ్మా!

ప్రేమతో నీ చిత్ర.

—"రాధిక"